కిషన్ రెడ్డిని కలిసిన నాయకులు



రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ నియోజకవర్గం శివ రాంపల్లిలో జరిగిన ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అధికారుల సమావేశంలో పాల్గొనడానికి వచ్చిన కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి బీజేపీ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహా రెడ్డి, నాయకులు నారగూడెం మల్లారెడ్డి, బొక్క బాల్‌రెడ్డి, కొత్త సోల్కర్ రెడ్డి, సాబాద విజయ్ కుమార్, హరికిషన్ జీ తదితరులు పాల్గొన్నారు.

నియామకం

చాంద్రాయణగుట్ట: చాంద్రాయణగుట్ట డివిజన్ బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడిగా టి.నరేష్ కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ నియోజకవర్గం ఇన్‌చార్జి ముప్పిడి సీతారాంరెడ్డి ఆయనకు నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నరేష్ కుమార్ మాట్లాడుతూ.. పార్టీలో ఏళ్ల తరబడిగా పని చేస్తున్న తన సేవలను గుర్తించి అధ్యక్ష పదవి అప్పగించడం సంతోషంగా ఉందన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ విజయం కోసం తనవంతుగా కృషి చేస్తానన్నారు. ప్రజా సమస్యలపై స్పందించి సామాన్య ప్రజానికానికి న్యాయం జరిగేలా చూస్తానన్నారు.

బాబోయ్.. కుక్కలు



వీధుల్లో తిరుగుతున్న కుక్కలు

- బస్తీలు, కాలనీల్లో కుక్కల స్వైర్య విహారం
- బెంబేలెత్తుతున్న ప్రజలు
- చోద్యం చూస్తున్న బల్దియా అధికారులు

గోల్కొండ: వీధులు, బస్తీలలో కుక్కలు స్వైర్య విహారం చేస్తున్నాయి. పగలు, రాత్రి కుక్కలు గుంపులుగా తిరుగుతున్నాయి. కుక్కల సంచారంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. వయస్సుతో సంబంధం లేకుండా పలు సందర్భాల్లో కుక్కలు కనబడ్డ వారిపై దాడి చేస్తూ కరుస్తున్నాయి. గత వారం షేక్‌పేట్‌లో ఇంట్లో నిద్రిస్తున్న ఓ ఐదు నెలల బాలుడిని కుక్కలు ఇష్టమొచ్చినట్లు కరిచాయి. ఈ బాలుడు ఉస్మానియా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. షేక్‌పేట్‌తో పాటు టోలిచౌకి చౌరస్తా, గుడిమల్కాపూర్ కూరగాయల మార్కెట్, మెహిదీపట్నం చౌరస్తా, గోల్కొండ, లంగర్‌హౌస్ తదితర ప్రాంతాల్లో కుక్కలు సంచరిస్తూ పాదచారులు, ద్విచక్రవాహనాలపై వెళ్లే వారిని భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. ఫ్లోర్ మిల్ నుంచి లంగర్‌హౌస్‌కు వెళ్లే ప్రధాన రహదారిపై రోడ్డుకు ఇరువైపులా వెళ్లే ద్విచక్ర వాహనాదారులపై కుక్కలు వెంటపడి మరి కరుస్తున్నాయి. ఫుట్‌పాత్‌లపై ఉండే టిఫిన్ సెంటర్లు, పాస్ట్‌ఫుడ్ సెంటర్లు కుక్కలకు అడ్డాలుగా మారాయి. ఇక్కడికి వచ్చే వారిని అరుస్తు పలుమార్లు మీదపడి దాడి చేస్తున్నాయి. ఇదిలా ఉండగా బస్తీ దవాఖానాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలతో పాటు పలు బల్దియా వార్డు కార్యాలయాలల వద్ద సైతం కుక్కలు తమ అడ్డాలుగా మార్చుకున్నాయి. గోల్కొండ పోలీస్‌స్టేషన్, గోల్కొండ ఏరియా ఆసుపత్రిల వద్ద సైతం వీధి కుక్కలు పెంపుడు కుక్కలుగా మారాయి. వీటిని తరిమి వేయడంలో అధికారులు గానీ సిబ్బంది గానీ ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు.

పట్టించుకోని అధికారులు..

- కుక్కల స్వైర్య విహారానికి పూర్తిగా బల్దియా అధికారులదే బాధ్యత అని పలువురు ఆరోపిస్తున్నారు.
- వీధుల్లో తిరిగాడే జంతువులను పట్టుకోవడానికి బల్దియాలో ప్రత్యేక విభాగం ఉంది. అయితే ఈ విభాగం సిబ్బంది ఎప్పుడో కానీ కనబడరు.
- వీధి కుక్కలు కరిచి ఎవరైనా మృతి చెందిన సందర్భాలలో వీరు వాహనాలు తీసుకోని మొక్కుబడిగా రెండు రోజులు బస్తీలు, కాలనీల్లో తిరుగుతారు తప్ప ఒక్క కుక్కను సైతం పట్టుకున్న దాఖలాలు లేవు.
- కేవలం కుక్కలనే కాకుండా వీధుల్లో సంచరించే జంతువులను బల్దియా వారు ఏమాత్రం పట్టించుకోవడం లేదు.
- కుక్కలు బస్తీలు, కాలనీల్లో పడి కరుస్తుండగా మరోవైపు వీధి జంతువులైన గేదెలు, మేకలు బల్దియా వారు ప్రతినిత్యం నీరు పోసి పెంచిన మొక్కలను తినేస్తున్నాయి.
- ప్రధాన రహదారుల మధ్య డివైడర్‌లపై వేసిన పచ్చని మొక్కలను గేదెలు, మేకలు మేసేస్తున్నాయి.
- వీధి జంతువులు వీధుల్లో తిరగాడకుండా పటిష్టమైన చర్యలు తీసుకోని పలువురు కోరుతున్నారు.

అధికారులు తగిన చర్యలు తీసుకోవాలి



పసిపిల్లలు కుక్క కాటుకు బలవుతున్నారు. షేక్‌పేట్‌లో వీధి కుక్కల స్వైర్య విహారాన్ని అధికారులు అడ్డుకోవాలి. ప్రభుత్వాలు మారుతున్నా అధికారులు తమ తీరును మార్చుకోవడం లేదు. బల్దియా వీధి జంతువుల విభాగం అధికారులు వీధి జంతువుల సంచారాన్ని అడ్డుకోవాలి. – బాలరాజ్, షేక్‌పేట్

నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవు



ఎక్సైజ్ సీఐ దేవేందర్‌రావు

అత్తాపూర్: నూతన సంవత్సర వేడుకలను ప్రతి ఒక్కరు ప్రభుత్వం సూచించిన నియమనిబంధనల ప్రకారం జరుపుకోవాలి. వాటిని అధిగమించిన వారిపై చట్టరిత్యా చర్యలు తీసుకోవాల్సి వస్తుందని శంషాబాద్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ జి. దేవేందర్‌రావు అన్నారు. మంగళవారం ఆయన అత్తాపూర్‌లోని ఎక్సైజ్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ తమ పరిధిలో 35 వైన్స్‌లు, 45 బార్, రెస్టారెంట్‌లు కొనసాగుతున్నాయన్నారు. గండిపేట మండలంలో అత్యధికంగా బార్, రెస్టారెంట్‌లు 26, వైన్స్‌లు 14 ఉన్నాయన్నారు. రాజేంద్రనగర్ పట్టణ పరిదిలో 12 బార్‌లు, 12 వైన్స్‌లు, శంషాబాద్ మండలంలో 7బార్‌లు, 9 వైన్స్‌లు ఉన్నాయన్నారు. నూతన సంవత్సరం వేడుకలలో ఇతరులకు ఎలాంటి ఇబ్బంది కాకుండా నిర్వహించుకోవాలన్నారు. ఇతరులను ఇబ్బందులకు గురిచేసినా వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. అర్ధరాత్రి 1.30 గంటలకు బార్‌లు అన్నీ మూసివేయాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



సయ్యద్ అబ్రార్ మృతదేహం

రాజేంద్రనగర్: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందిన సంఘటన రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం ఉదయం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పాతబస్తీ తలాబ్‌కట్ట ప్రాంతానికి చెందిన సయ్యద్ అబ్రార్ (24) మెహదీపట్నంలోని ఓ మదర్సాలో ఉపాధ్యాయునిగా బోధనలు చేస్తున్నాడు. మంగళవారం ఉదయం 7.30 గంటల ప్రాంతంలో మెహదీపట్నంలోని మదర్సాకు తన ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా ఆరాంఘర్ పిల్లర్ నంబర్-245 వద్దకు రాగానే వెనుక నుంచి గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టడంతో అబ్రార్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఆ సమయంలో దట్టంగా పొగ మంచు కమ్ముకోవడంతో ఈ సంఘటన జరిగి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించి, పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు కొనసాగిస్తున్నమన్నారు.

గుర్తు తెలియని మహిళ మృతి

శంషాబాద్: పట్టణంలోని ఉందానగర్ రైల్వేస్టేషన్ సమీపంలో గుర్తు తెలియని మహిళ (45) మృతి చెందింది. దీంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. మృతురాలు యాచకురాలై ఉండవచ్చని సరైన ఆహారం లేకపోవడంతో మృతిచెంది ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించి, దర్యాప్తు చేస్తున్నమన్నారు.

ఘనంగా నమ్మళ్వార్ పరమ పదోత్సవం

జియాగూడ: జియాగూడలోని రంగనాథస్వామి ఆలయంలో నమ్మళ్వార్ పరమ పదోత్సవాలు ఘనంగా జరిగాయి. సాయంత్రం ప్రారంభమైన వేడుకల్లో భాగంగా స్వామివారి పల్లకీ సేవా, హారతి, శాంతుముర్రై, వివిధ రకాల ప్రసాదముల ఘోష్టి, రాపత్తు ఉత్సవ సమాప్తి ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఆలయ ప్రతినిధి శేషాచార్యులు వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు శంకర్‌యాదవ్, సున్నం రాజ్‌మోహన్, రాష్ట్ర బీఆర్‌ఎస్ నాయకుడు రాహుల్‌రావ్, సందీప్‌లాల్ తదితరులు పాల్గొన్నారు.

గోల్కొండ ఆసుపత్రిలో
కోవిడ్ పరీక్షలకు ప్రత్యేక విభాగం

గోల్కొండ: కోవిడ్ పరీక్షలకు గోల్కొండ ఏరియా ఆసుపత్రిలో ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటు చేస్తున్నామని గోల్కొండ ఏరియా ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ మజహర్‌ఉల్లా అన్నారు. మంగళవారం ఆయన ఆసుపత్రిలో కోవిడ్ పరీక్ష కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కోవిడ్ లక్షణాలతో వచ్చే వారికి విడిగా కౌంటర్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఔట్ పేషంట్స్ రిజిస్ట్రేషన్ విభాగంలో దీనిని ఏర్పాటు చేస్తే వ్యాధులు ఒకరి నుంచి ఒకరికి వచ్చే ప్రమాదం ఉందని అందుకే దీనిని ఆసుపత్రి ఆవరణలో ప్రత్యేకంగా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పాజిటివ్ లక్షణాలు ఉన్న వారికి మందులు కూడా సిద్ధంగా ఉన్నాయని ఆయన అన్నారు.

షాదాన్ కళాశాలలో ప్రారంభమైన పల్సేషన్ కార్యక్రమం



షాదాన్ కళాశాలలో నిర్వహించిన పల్సేషన్-2023లో పాల్గొన్న విద్యార్థులు

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని షాదాన్ కళాశాలలో పల్సేషన్-2023 కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా ప్రారంభించారు. అత్యుత్తమ వార్షిక ఇంటర్-కాలేజీ కల్చరల్, లిటరరీ, స్పోర్ట్స్, ఫుడ్ ఫెస్టివల్స్ నిర్వహిస్తున్నారు. షాదాన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్, డాక్టర్ వీఆర్‌కే హుమెన్ మెడికల్ కాలేజీ, అయాన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైసెన్స్‌లు సంయుక్తంగా ఈ పల్సేన్-2023ని నిర్వహిస్తున్నాయి. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా షాదన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ డీన్ డాక్టర్ బి.జగన్‌మోహన్, డాక్టర్ వీఆర్‌కే హుమెన్ మెడికల్ కాలేజీ డీన్ డాక్టర్ కె.విజయాల్, అయాన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైసెన్స్‌లు డీన్ డాక్టర్. మోహన్‌రావులు హాజరైయ్యారు. డిసెంబర్ 26వ తేదీ నుంచి జనవరి 2వ తేదీ వరకు ఈ పల్సేషన్ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. 8 రోజుల పాటు వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తు విద్యార్థులు పాల్గొంటారన్నారు. పల్సేషన్-2023లో భాగంగా ఫ్లాగ్ హోస్టింగ్, స్వచ్ఛ భారత్, రక్తదానం, వైద్య శిభిరం, వివిధ పోటీలు తదితర కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.



రక్తదాన శిబిరంలో విద్యార్థులు



కళాశాలలో స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో దృశ్యం

ప్రజాసంక్షేమమే ధ్యేయం



మాట్లాడుతున్న పీసీసీ ఎస్పీ సెల్ ఉపాధ్యక్షుడు నరేందర్, పట్టణ అధ్యక్షుడు సంజయ్‌యాదవ్

శంషాబాద్: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ఈ నెల 28 నుంచి ' ప్రజాపాలన' కార్యక్రమం ప్రారంభం కానుందని పీసీసీ ఎస్సీసెల్ ఉపాధ్యక్షుడు జల్లపల్లి నరేందర్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు పి. సంజయ్ యాదవ్ అన్నారు. పార్టీ అధిష్టానం సూచన మేరకు ప్రజాపాలనలో అమలయ్యే సంక్షేమ పథకాలను పారదర్శకంగా ప్రభుత్వం అందించేందుకు పార్టీ శ్రేణులు దోహదం చేయాలని వారు సూచించారు. ఇచ్చిన ప్రతి హామీని అమలుపరే దిశగా ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోందన్నారు. పాత రేషన్‌కార్డులు రద్దవతాయంటు కొందరు సామాజిక మాధ్యమాల ద్వారా చేస్తున్న దుష్ప్రచారాలను నమ్మవద్దన్నారు. ప్రజాపాలన ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరు ఆయా పథకాల ద్వారా లబ్ధిపొందుతారన్నారు. పార్టీ సీనియర్ నాయకులు మైలారం సులోచన, ఆర్.ఎస్ అంజయ్య, రాచమల్ల జగన్, అక్రమ్‌ఖాన్, పెద్దగండు శ్రీధర్, ప్రవీణ్‌యాదవ్, అబ్దుల్‌గనీ, అలీం, శివాగౌడ్, రాజు, తిరుపతి యాదవ్, అర్జున్ యాదవ్, కుమార్‌ముదిరాజ్ పాల్గొన్నారు.

ఘనంగా దత్త జయంతి వేడుకలు



విజయ గణపతి దేవాలయంలో దత్త యాగంలో పాల్గొన్న భక్తులు

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ హైదర్షాకోట్‌లోని విజయగణపతి దేవాలయంలో శ్రీ దత్త జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. దేవాలయంలో ఉదయం నుంచే దత్తాత్రేయ స్వామికి దివ్య అభిషేకాలు, దత్త యాగం, పూర్ణాహుతి, మహా మంగళహారతి తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించారు. మాజీ ఆలయ కమిటి చైర్మన్ కటారే రామ్‌నరేష్ తన కుటుంబ సభ్యులతో కలిసి దత్తాత్రేయ స్వామికి అభిషేకంతో పాటు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం దత్త యాగంలో పాల్గొన్నారు. స్థానిక ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన ప్రసాద వితరణ, అన్నదాన కార్యక్రమాల్లో పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ పూజల్లో ఆలయ కమిటి చైర్మన్ శ్రీధర్, నారాయణరావు, లక్ష్మినారాయణ, రామచంద్రయ్యగుప్తా, విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

పాతబస్తీలో అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించాలి

చార్మినార్: పాతబస్తీలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతి పత్రం అందజేసినట్లు బహదూర్‌పురా నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి పులిపాటి రాజేష్ కుమార్ (రాహుల్) తెలిపారు. హైదరాబాద్ జిల్లాలోని 15 నియోజకవర్గాలకు చెందిన కాంటెస్టెడ్ ఎమ్మెల్యేలతో జిల్లా మంత్రి పొన్నం ప్రభాకర్ మంగళవారం గాంధీభవన్‌లో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేష్ కుమార్ మాట్లాడుతూ.. అభివృద్ధిలో వెనుకబడిన బహదూర్‌పురా నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో సాధ్యమైనంత వెంటనే అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహించాలని తాను పొన్నం ప్రభాకర్‌కు సమర్పించిన వినతి పత్రంలో పేర్కొన్నట్లు తెలిపారు. ఈనెల 28వ తేదీ నుంచి ప్రారంభం కానున్న ప్రజా పాలన కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లాలోని 15 నియోజకవర్గాల నుంచి పోటీ చేసిన అభ్యర్థులందరికీ ప్రాధాన్యత కల్పించడం పట్ల పొన్నం ప్రభాకర్‌కు ధన్యవాదాలు తెలియజేసినట్లు ఆయన తెలిపారు.

వేధింపులకు పాల్పడే వారిపై చర్యలు తీసుకోవాలి

చార్మినార్: చార్మినార్ నియోజకవర్గంలోని మూసాబౌలీకు చెందిన మజ్లిస్ పార్టీ నాయకులు తమను కావాలని వేధింపులకు గురి చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ చార్మినార్ నియోజకవర్గం ఇన్‌చార్జి మహమ్మద్ ముజీబ్ ఉల్లా షరీఫ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల జరిగిన ఎన్నికల సందర్భంగా మజ్లిస్ పార్టీ నాయకులతో తమకు జరిగిన ఘర్షణను దృష్టిలో ఉంచుకొని కావాలని స్థానికంగా తమ కుటుంబ సభ్యుల ఇంటి వద్ద పారిశుద్ధ్య సమస్యలు సృష్టించి ఘర్షణకు దిగుతున్నారన్నారు. ఈ విషయమై సంబంధిత హుస్సేనీ ఆలం పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. తమ పైనే దాడికి పాల్పడి తిరిగి తమపైనే పోలీసులకు ఫిర్యాదు చేయడం దురదృష్టకరమన్నారు. ఉద్దేశపూర్వకంగా వేధింపులకు గురి చేస్తున్న మజ్లిస్ పార్టీ నాయకులపై చట్ట ప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఇదిలా ఉండగా కాంగ్రెస్ పార్టీ నాయకులు తమపై దాడికి పాల్పడినట్లు ఇప్పటికే మజ్లిస్ పార్టీ నాయకులు హుస్సేనీ ఆలం పోలీసులకు రాత పూర్వకంగా ఫిర్యాదు చేశారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన

గన్‌ఫౌండ్రీ: ప్రముఖ నృత్య కళా సంస్థ సుమధుర ఆర్ట్స్ అకాడమీ 18వ వార్షికోత్సవ వేడుకలను మంగళవారం రవీంద్రభారతిలో ఘనంగా నిర్వహించారు. నృత్య గురువు శ్రావ్య మానస బోగిరెడ్డి శిష్య బృందం 300 మంది కళాకారులచే సుమధురోత్సవం పేరిట నిర్వహించిన నృత్య సంగీత విభావరి ఆహుతులను ఆకట్టుకుంది. ఆనంద తాండవం, మండోదరి శబదం, శివార్పణం, థిల్లాన వంటి అంశాలతో పాటు వివిధ శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ, నాట్య గురువులు బాగవతుల సేతురామ్, కళాకృష్ణ, సినీ నటులు హేమ, రూపలక్ష్మీ, శ్రీనివాస్ బోగిరెడ్డి, సంగీత గురువులు ప్రతాప్, మురళి, శరత్ బోగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఆటోవాలాల నిరసన ర్యాలీ



శంషాబాద్‌లో ర్యాలీ తీస్తున్న ఆటోవాలాలు

శంషాబాద్: మహాలక్ష్మీ పథకంతో రాష్ట్రంలో వేలాది మంది ఆటోవాలాల జీవితం ఆగమైపోతోందని భారతీయ మజ్దూర్ సంఘ్ ఆటో, ట్యాక్సీ యూనియర్ రాష్ట్ర అధ్యక్షుడు చింతల నందకిశోర్ గుప్తా అన్నారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళల ఉచిత ప్రయాణాన్ని నిరసన వ్యక్తం చేస్తూ ఆటోవాలాలు పెద్ద సంఖ్యలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మహాలక్ష్మీ పథకంతో ఆటో, టాక్సీ వాలల జీవనోపాధి కష్టంగా మారుతున్నా ప్రభుత్వం ఇంకా దిద్దుబాటు చర్యలు తీసుకోకపోవడం అన్యాయంగా ఉందన్నారు. ఆటోవాలాల డిమాండ్లను రాష్ట్ర సర్కారు వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. నెలవారి భృతి ఇవ్వడంతో పాటు రవాణా శాఖ నుంచి ఉన్న అన్ని పన్నులు, రిజిస్ట్రేషన్ ఫీజులు తొలగించాలన్నారు. కొన్ని రూట్లలో బస్సుల సంఖ్యను తగ్గించాలన్నారు. వెంటనే ప్రభుత్వం పరిష్కార మార్గాన్ని చూపాలని కోరారు. కార్యక్రమంలో ఎండీ సయ్యద్, రవి, శ్రీను, రాజు, జగదీష్, శివ, దర్శన్, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

బానిసత్వ నిర్మూలనకే 'సీపీఐ'



సీపీఐ పార్టీ జెండాను ఆవిష్కరించిన నర్సింగరావు తదితరులు

మణికొండ: ఆనాటి బ్రిటీష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడి దేశ ప్రజల బానిసత్వాన్ని ప్రాలదోలేందుకే 1925లో భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) ఆవిర్భవించిందని ఆ పార్టీ జిల్లా మాజీ కార్యదర్శి, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యులు పుస్తకాల నర్సింగ్‌రావు పేర్కొన్నారు. మంగళవారం సీపీఐ పార్టీ 99వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని గండిపేట మండలం, మంచిరేవులలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ స్వాతంత్ర పోరాటంలో ప్రజలను ఐక్యం చేసిన సీపీఐ, ఆ తరువాతి కాలంలో భూమి కోసం, భుక్తి కోసం పోరాటం చేసి ప్రజల అసమానతలను దూరం చేసిందన్నారు. తెలంగాణ సాయుధ పోరాటంలో 4వేల మంది కమ్యూనిస్టు కార్యకర్తల ప్రాణ త్యాగాలు చేసి నిజాం నవాబు నుంచి తెలంగాణను విముక్తి చేసిందన్నారు. ఆయా పోరాటాలతో పది లక్షల ఎకరాల భూమిని ప్రజలకు పంచి పెట్టిన ఘనత సీపీఐ పార్టీకే దక్కుతుందన్నారు. ఇప్పటికీ అన్ని వర్గాల కార్మికుల శ్రేయస్సు కొరకు నిరంతరం పోరాటం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు శంకరయ్య, ఎస్. మల్లేష్, ఎం.బాబురావు, స్వామి సురేష్, భిక్షపతి, రమేష్, నరేష్, నర్సింహులు, రాఘవేందర్‌రావు, ప్రవీణ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

'ప్రజాపాలన' దరఖాస్తుల స్వీకరణ



అధికారుల సమావేశంలో సర్కిల్ ఉపకమిషనర్ రవికుమార్

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని ఐదు డివిజన్‌లలో ఈ నెల 28 నుంచి జనవరి 6వ తేదీ వరకు ప్రజాపాలన దరఖాస్తుల స్వీకార కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సర్కిల్ ఉపకమీషనర్ రవికుమార్ వెల్లడించారు. మంగళవారం ఉదయం సర్కిల్ కార్యాలయం ఆవరణలో దరఖాస్తులు స్వీకరించనున్న అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రతి డివిజన్‌లో 28వ తేదీ నుంచి 6వ తేదీ వరకు దరఖాస్తులను బస్తీలు, కాలనీల వారిగా స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ప్రతి రోజు ఆయా బస్తీలలో ఏర్పాటు చేయనున్న దరఖాస్తుల స్వీకరణ కౌంటర్లలలో స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఇంటికి ఒక దరఖాస్తు అందిస్తున్నామని దానిని పూర్తి చేసి కౌంటర్‌లో ఇవ్వలని తెలిపారు. ప్రతి కేంద్రం వద్ద నాలుగు కౌంటర్లు ఉంటాయని తెలిపారు. ఒక కౌంటర్ వృద్ధులకు, వికలాంగులకు కేటాయించామని అన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకొవాలని కోరారు.

శంషాబాద్ రూరల్: ప్రభుత్వం అమలు చేయనున్న 'ఇందిరమ్మ' పథకం లబ్ధిదారుల ఎంపిక కోసం ఈ నెల 28 నుంచి ప్రజా పాలన కార్యక్రమం చేపట్టనున్నారు. మండలంలోని వివిధ పంచాయతీల కార్యాలయాల వద్ద ఏర్పాటు చేయనున్న సభలో అధికారులు దరఖాస్తులను స్వీకరించనున్నారు. 28న నర్కూడ, కవ్వగూడ, పాల్మాకుల, జూకల్, పెద్దషాపూర్, పెద్దషాపూర్‌తాండలో. 29న పెద్దగోల్కొండ, మదన్‌పల్లిపాత తాండ, పెద్దతూప్ర, పెద్దతూప్రతాండ, రామంజాపూర్, చౌదరిగూడ. 30న పిల్లోనిగూడ, అలీకోల్‌తాండ, చిన్నగోల్కొండ, బహదూర్‌గూడ, సుల్తాన్‌పల్లి, కాచారం, జనవరి 2న మదన్‌పల్లి, రషీద్‌గూడ, ఘాంసిమియాగూడ, మదన్‌పల్లి కొత్తతాండ, శంకరాపురం, హమీదుల్లానగర్. 3న మల్కారం, ముచ్చింతల్, ననాజీపూర్‌లో ప్రజా పాలన నిర్వహించనున్నారు. ఇందుకోసం ఎంపీడీఓ వసంతలక్ష్మీ, తహసీల్దార్ నాగమణి, ఎంపీఓ ఉషాకిరణ్‌ను టీం లీడర్లగా నియమించారు. గ్రామాల్లో కుంటుంబాల సంఖ్యను ఆధారంగా దరఖాస్తుల స్వీకరణకు కౌంటర్లను ఏర్పాటు చేయనున్నాట్లు తెలిపారు.

తెలుగు రాష్ట్రాలు సుభిక్షంగా ఉండాలి

అబిడ్స్: తెలుగు రాష్ట్రాలు సుభిక్షంగా ఉండాలని తెలంగాణ రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కోలేటి దామోదర్‌గుప్తా పేర్కొన్నారు. తెలుగు ప్రజలు రెండు రాష్ట్రాలతో పాటు ప్రపంచ వ్యాప్తంగా కొత్త సంవత్సరంలో సుఖః సంతోషాలతో ఉండాలన్నారు. మంగళవారం తిరుమలలో వైకుంఠ ద్వార దర్శనం చేసుకుని టీటీడీ చైర్మన్ భూమన కర్ణాకర్‌రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా దామోదర్‌గుప్తా మాట్లాడుతూ.. తెలుగు రాష్ట్రాల ప్రజలు శాంతియుతంగా, సంతోషంగా ఉండాలని కోరారు.

గోల్కొండ కోటకు పోటెత్తిన పర్యాటకులు



గోల్కొండ: గోల్కొండ కోటకు పర్యాటకు భారీ ఎత్తున తరలివచ్చారు. తెలంగాణలోని వివిధ జిల్లాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి పర్యాటకులు వేల సంఖ్యలో కోటకు తరలివచ్చారు. యువ జంటలు గోల్కొండ కోట చౌరస్తా వద్ద, కోటలోని ఫిరంగుల వద్ద సెల్ఫీలు దిగుతూ సంబరపడ్డారు. చిన్నారులు కోటలోని నగీనాబాగ్, రాణిమహల్ తదితర ప్రాంతాలలోని పచ్చిక మైదానంలో ఆటలు ఆడుకుంటూ ఆనందపడ్డారు. విదేశీ పర్యాటకులు సైతం గోల్కొండకు తరలివచ్చి అబ్బో గోల్కొండ కోట అంటూ గోల్కొండ కోటను తమ కెమెరాలు, సెల్‌ఫోన్‌లలో బంధించుకున్నారు.

అయ్యప్ప భక్తులకు కేరళ ప్రభుత్వం సౌకర్యాలు కల్పించాలి



అబిడ్స్: అయ్యప్ప భక్తులకు కేరళ ప్రభుత్వం సకల సౌకర్యాలు కల్పించాలని గోషామహల్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ నాయకుడు ఎస్.ధన్‌రాజ్ పేర్కొన్నారు. లక్షలాది మంది అయ్యప్ప భక్తులు కేరళలో అవస్థలు పడుతున్నా అక్కడి ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుందని ఆరోపించారు. అయ్యప్ప స్వామి రథయాత్ర మలక్‌పేట్ వారు నిర్వహించిన వేడుకల్లో ధన్‌రాజ్ పాల్గొని పూజలు చేశారు. అనంతరం మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేరళ ముఖ్యమంత్రితో మాట్లాడి అయ్యప్ప స్వామి భక్తుల సమస్యలు తీర్చాలన్నారు. ఈ వేడుకల్లో రాముయాదవ్ గురుస్వామి, నాని గురుస్వామి, పోల్కం శ్రీనివాస్ గురుస్వామి, చింటు స్వామి, పాపగౌడ్ స్వామి, ప్రశాంత్ గురుస్వామి పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం

గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి పనులను వేగంగా చేయిస్తానని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. మంగళవారం ఆయన గోల్కొండ, నానల్‌నగర్ డివిజన్‌లలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఆగిపోయిన రోడ్లు, డ్రైనేజీ పనులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గత రెండు నెలలకు పైగా అసంపూర్తి పనులతో ప్రజలు ఇబ్బందులకు గురయ్యారన్నారు. అయితే ఈ అసంపూర్తి పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించామన్నారు. మోతీదర్వాజా నుంచి కంపెనీబాగ్ మీదుగా లంగర్‌హౌస్ వైపు వెళ్లే రోడ్డు మరమ్మతులు పూర్తి అవుతాయని దీన్ని వల్ల ద్విచక్ర వాహనాదారులకు తిప్పలు తప్పుతాయని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మజ్లిస్ నాయకులు సయ్యద్ ఆజామ్, బదరుద్దీన్ తదితరులున్నారు.